క్లుప్తంగా

వ్యవసాయ శాస్త్రవేత్తల సందర్శన



గరికపాడు(జగ్గయ్యపేట): మండలంలోని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను గుంటూరు లాంఫాం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు బిలికిస్, లక్ష్మి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కేవీకేలోని రైతులకు అవసరమైన విత్తనాలు, సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు కేవీకేలో అన్ని రకాల పంటలకు సంబంధించి శాస్త్రవేత్తలు అందుబాటులో ఉన్నారన్నారు. ఇటువంటి క్షేత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లాం ఫాం కళాశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు తక్కెళ్లపాడు, బలుసుపాడు గ్రామాల్లో మూడు నెలల పాటు గృహ విజ్ఞానంపై రైతులకు అవగాహన కలిగిస్తారని వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కృష్ణంరాజు, శాస్త్రవేత్తలు ప్రభావతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు



మక్కపేట(వత్సవాయి) : గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు సోమవారం విరాళాలు అందించారు. గ్రామానికి చెందిన ఆళావతు పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి మనుమడు గుగులోతు స్వామి, బాణావతు నాగమ్మ వారి కుమారుడు సత్యనారాయణలు చెరో రూ 10,016లను విరాళంగా అందజేశారు. వీటిని డిపాజిట్ చేసి వీటిపై వచ్చే వడ్డీని పాఠశాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. నగదును గ్రామానికి చెందిన వారి సన్నిహితులు అజ్మీరు శ్రీనివాసరావు, గుగులోతు కోటయ్యల చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్రాల వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం దాతలను అభినందించారు. దాతల కోరిక మేరకు పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పారు.

ఆలయ ఆదాయం రూ.6.01 లక్షలు



నందిగామటౌన్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.6.01 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సీతారామయ్య తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం కానుకల హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39 రోజులకుగాను రూ.6.01లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, దుర్గాశివ సాయి సేవాసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉదయభానుకు సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును సోమవారం సీఎస్ఐ(చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా)కృష్ణా–గోదావరి డయోసిస్ సీఎస్ఐ ఎయిడెడ్ స్కూల్స్ రిటైర్డ్ మేనేజర్ రెవ డాక్టర్ పీఎస్‌వీ ప్రసాదరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉదయభానును కలిసి పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. ఇటీవల ఉదయభాను జన్మదిన వేడుకలు జరిగిన విషయం తెలుసుకున్న ప్రసాదరావు ప్రత్యేకంగా కేక్‌ను తెప్పించి ఉదయభానుచే కట్ చేయించారు.

110 మందికి వైద్యపరీక్షలు




వీరులపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిమ్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ సీఈవో డాక్టర్ కాకర్ల విశ్వచరణ్ తెలిపారు. ఇబ్రహీంపట్నంకు చెందిన నిమ్రా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వీరులపాడులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 110మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వట్టికొండ చంద్రమోహన్, మందూరి ప్రకాశరావు, వాసిరెడ్డి రాధాకృష్ణ, నల్లమల ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

8న ఎస్ఎంసీల ఎన్నిక



గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



కంచికచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నోటీస్‌బోర్డులో ఏర్పాటుచేసిన ఎస్ఎంసీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రతులు

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వతేదీన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని 201పాఠశాలలు ఉండగా 19,409మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఓటర్లుగా ఉంటారు. ఆయా యాజమాన్య కమిటీల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఇప్పటికే రూపొందించారు. సుమారు ఆయా పాఠశాలల్లో కలిపి మొత్తం 12వేల మంది ఓటర్లు ఉంటారు. ఈనెల 8వతేదీ ఉదయం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకు ప్రత్యేక పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు నిర్వహించి కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నిక నిర్వహణకు 59శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాల్సి ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల మధ్య కొత్త కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి..

ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. కమిటీ ఎన్నికలు జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికయిన సభ్యులతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, లేదా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తాడు. గ్రామాల్లో సర్పంచి, మున్సిపాలిటీలో చైర్మన్లు వారి ప్రాంతాల్లో ఎప్పుడైనా ఎస్ఎంసీ సమావేశాలకు వారి ఇష్టానుసారం హాజరుకావచ్చు. గతంలో కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి, ఎన్నికలు ఎక్కడా వాయిదా పడలేదు.

నిబంధనల మేరకు ఎన్నికలు...



ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేసినట్లు కంచికచర్ల ఎంఈవో బి.బాలాజీ తెలిపారు. ఈనెల 8వ తేదీన ఎన్నికలు జరిగే రోజున అవసరమైన చోట పోలీస్ బందోబస్తు కోరుతాం. నిబంధనల మేరకు తల్లిదండ్రుల సహకారంతో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తాం.

– బీ బాలాజీ ఎంఈఓ, కంచికచర్ల

ఘనంగా శ్రావణ మాస ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు

నందిగామటౌన్: నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వేంచేసియున్న ఆలయాల్లో సోమవారం శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రావణమాసం హిందువులకు అతి పవిత్రమైన మాసం కావడంతో వేకువ జామునే తలస్నానాలాచరించి ఆయా ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శుకశ్యామలాంబ అమ్మవారు, కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మీ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష అర్చనలు నిర్వహించారు. పల్లగిరి గట్టు సమీపంలోని త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న జ్ఞానసరస్వతి, కనకదుర్గ, కనకమహాలక్ష్మి అమ్మవార్లకు దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి వారి ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవాదాయ శాఖాధికారులు, ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దాడి ఘటనతో మాకు సంబంధం లేదు

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)

జగ్గయ్యపేట అర్బన్: కొనకంచి క్రాస్ రోడ్ వద్ద నవాబుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడుపై జరిగిన దాడితో తమకు గానీ, తమ పార్టీకి గానీ సంబంధం లేదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)అన్నారు. ఇది కేవలం నవాబుపేటలో ఉన్న పాతకక్షల నేపథ్యంలోనే జరిగిందని పేర్కొన్నారు. జగ్గయ్యపేటలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనకంచి క్రాస్ రోడ్ వద్ద నవాబుపేట గ్రామ నాయకుడుపై జరిగిన దాడిని టీడీపీ ఖండిస్తోందన్నారు. ఈ దాడికి పాల్పడినవారిపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం నుంచి పోలీసుశాఖకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ఈ దాడి ఘటనపై మాజీ ఎమ్మెల్యే ఉదయభాను వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. నవాబుపేట గింజుపల్లి వీరయ్య, బుచ్చయ్యచౌదరి కేసులతోపాటు గతంలో నియోజకవర్గంలో జరిగిన మూడు హత్యలపై సీబీఐ లేదా సీబీసీఐడీ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కూడా సిద్ధంగా ఉంటే ముందుకు రావాలని కోరారు. సమావేశంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, పట్టణ కార్యదర్శి మైనేని రాధా, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికునికి ఉదయభాను నివాళి



సోమేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న ఉదయభాను, రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘంలో పారిశుద్ధ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ కార్మికునిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన పోతిపాక సోమేశ్వరరావు మృతదేహాన్ని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సందర్శించి నివాళులర్పించారు. మృతుడు సోమేశ్వరరావు కుమారుడు, నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లును పరామర్శించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమేశ్వరరావు మృతదేహాన్ని పలువురు సీపీఐ నాయకులు, మున్సిపల్ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

చివరి భూములకు సాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే సౌమ్య



గండేపల్లిలోని కీసర పంపింగ్ స్కీమును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్ల : ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని గండేపల్లిలోని కీసర పంపింగ్ స్కీమును సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ రైతు శ్రేయస్సే టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తున్నారన్నారు. ఇప్పటికే పంపింగ్ స్కీమ్ మరమ్మతుల కోసం రూ.25లక్షలు నిధులు మంజూరుచేసి అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



జగ్గయ్యపేటలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: కేరళలోని వయానాడ్ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు జగ్గయ్యపేటలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని సీపీఎం పార్టీ పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేరళలోని వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగడం దురదృష్టకరమన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ స్పందించి విరాళాలు అందజేసి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రామనాధం, షేక్ గౌసమియా, కోట రవికుమార్, వి.రాంప్రసాద్, రావెళ్ల శేషు, దాసరి నాగేశ్వరరావు, బూషమ్మ, బాలు, ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు నిరంతర శ్రమ అవసరం



మాట్లాడుతున్న కాలేజీ పాలకవర్గ అధ్యక్షుడు మల్లికార్జునరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పాలకవర్గ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు అన్నారు. బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులకు తరగతులు ప్రారంభం, పరిచయ కార్యక్రమాలను ఆ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చలవాది మల్లికార్జునరావు మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. విద్యార్థిగా ఎంత కష్టపడితే అంత ఉన్నత స్థాయికి ఎదగటానికి అవకాశముంటుందని చెప్పారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు మంచి స్థాయికి ఎదగటానికి తమను తాము ఉత్తమంగా తీర్చిదిద్దుకోవటానికి కృషి చేయాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు పోటీ పడాలన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దటానికి తమ కళాశాల యజమాన్యం నిరంతరం బాసటగా నిలుస్తుందన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తమ కళాశాల నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి అవసరమయ్యే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని బయటకు వెళ్లాలని సూచించారు. ఆ దిశగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కె.రాఘవయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చదువుకునేందుకు పేదరికం అడ్డంకిగా మారి ఇబ్బందులు పడుతున్న విద్యార్థినికి నగరానికి చెందిన దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. సెంట్రల్ నియోజకవర్గం అజిత్‌సింగ్‌నగర్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కోట సౌమ్యకు తల్లిదండ్రులు లేకపోవడంతో సింగ్‌నగర్ గంగానమ్మ గుడి వద్ద నివసిస్తున్న నాయనమ్మ దుర్గమ్మ దగ్గర ఉంటోంది. కూలి పనులు చేసుకుంటూ మనుమరాలిని పోషిస్తూ చదివిస్తున్న దుర్గమ్మ సహాయం కోసం దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించింది. స్పందించిన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10 వేలు నగదును సింగ్‌నగర్ ఉమెన్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, సంస్థ గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ చందు, హోంగార్డ్ ప్రసాద్ ద్వారా సోమవారం సౌమ్య చదువుకుంటున్న పాఠశాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ బాగా చదుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించే తనలాంటి పేద విద్యార్థులకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తున్న దీవెన ఫౌండేషన్ గ్రూప్ సభ్యులకు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలియజేశారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



చెవిటికల్లు(కంచికచర్ల): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కంచికచర్ల ఎంఈఓ బి.బాలాజీ ఆదేశించారు. చెవిటికల్లు ఎంపీయూపీ స్కూల్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు హాజరయ్యారని హాజరు పట్టీని పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. పాఠశాల ఆవరణతోపాటు తరగతుల గదులన్నీ శుభ్రం చేయించాలని, మరుగుదొడ్లు కూడా ప్రతిరోజు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విజేతలకు అభినందన



భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ – 2024 పోటీల్లో జె.కె.గోజురియో కరాటే అకాడమీ(గొల్లపూడి) సత్యనారాయణపురం బ్రాంచి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ నెల 4న విశాఖపట్నం గాజువాకలోని అగ్నికుల క్షత్రియ కళాక్షేత్రంలో నిర్వహించిన థర్డ్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పాల్గొన్న విద్యార్థుల్లో బి.ఆద్యశ్రీ(ప్రథమ), కె.భవితరెడ్డి(ప్రథమ), బి.హిమ శ్రీ, కె.లీలా కృష్ణ, బి.సాయి అక్షయ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సత్యనారాయణపురం బ్రాంచి హెడ్ కోచ్ పి.హర్ష విజేతలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో బహుమతులు సాధించడం ముఖ్యం కాదని, పాల్గొనడమే ప్రధానమని పేర్కొన్నారు. అందునా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించటం అభినందనీయమని చెప్పారు. విజేతలను అభినందించిన వారిలో అకాడమీ వ్యవస్థాపకుడు జె.శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరనాథ్ ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభచూపిన విద్యార్థి



నటరాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌వారు ఇటీవల విజయవాడ పటమట చెన్నుపాటి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో జగ్గయ్యపేటలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.నటరాజ్ జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్ తెలిపారు. దీంతో ఈనెల 22 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లాజట్టుకు నటరాజ్ ఎంపికైనట్లు వివరించారు. క్రీడల్లోనే కాకుండా ఇంటర్ సీఈసీ గ్రూపులో 471/500 మార్కులతో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించాడని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న నటరాజ్‌ను కళాశాల కరస్పాండెంట్ బి.సరిత, అధ్యాపక బృందం అభినందించారు. నటరాజ్ ఆయా పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ, ఆర్థిక వనరులను కళాశాల యాజమాన్యం అందిస్తోందని ప్రిన్సిపాల్ వివరించారు.

నందిగామ తహసీల్దార్‌గా సురేష్‌బాబు



తహసీల్దార్ సురేష్‌బాబు

నందిగామ టౌన్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన నందిగామ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న సరస్వతి బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో సురేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సురేష్ బాబును డిప్యూటీ తహసీల్దార్ రిబ్కారాణి, ఆర్ఐ వేణుకుమారి, సీనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆయా గ్రామాల వీఆర్వోలు కలిసి అభినందనలు తెలియజేశారు.

వత్సవాయి తహసీల్దార్‌గా నరసింహారావు



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న డీటీ రవికుమార్, వీఆర్వోలు

వత్సవాయి: మండల తహసీల్దార్‌గా నరసింహారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ ఎం.రవి కుమార్, ఆర్ఐ సూర్యకుమారి తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నరసింహారావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. వీఆర్వో సంఘ నాయకులు కుక్కల సురేష్, ఎస్కే సుభాని, జి.స్వామి, పరమేష్, ఖాసీం పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



పేటలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది



బాలింత ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రంగస్వామి బజారులో ఉన్న 12, 13, 14వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీకాంతమ్మ, అనంతలక్ష్మి, సీతామహాలక్ష్మి, ఇంద్రాణి, సత్య, సీతమ్మ కలసి ఆయా కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, తల్లి పాల ప్రాముఖ్యతపై వారికి వివరించారు. బిడ్డకు పాలిచ్చే విధానంపై బాలింతలకు అవగాహన కల్పించారు. వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ప్రతి మహిళ తప్పకుండా పిల్లలకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో 8వ సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి



నాట్యాచారిణి శ్రీదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు చెప్పారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, సంగీత సమ్రాట్ కళాసంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం తిరుపతికి చెందిన కళాకారుల భరత నాట్య ప్రదర్శన, నాట్యాచారిణి కే శ్రీదేవికి ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రహ్మానందరావు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని, వారిసేవలను గుర్తించి ప్రోత్సహించాలని చెప్పారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, ఏబీ ఆనంద్, బోడి ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.